సాక్షి ఒడిశా

సోమవారం । 25 । ఆగస్టు । 2025

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

• మరొకరికి గాయాలు

మల్కన్‌గిరి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా..మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి యం.వి.79 పోలీసుస్టేషన్ పరిధిలోని ఎదుకొండ గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు బైకులతో ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేయగా.. యం.వి.79 పోలీసుస్టేషన్ ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన యువకుడుని సురేష్ కర్తామి (17)గా గుర్తించారు. అతని మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గాయపడిన యువకుడు కేశ సోడికి చికిత్స అందిస్తున్నారు



సురేష్ కర్తామి మృతదేహం



చికిత్సపొందుతున్ కేశ సోడి

న్యూస్‌రీల్


ఓఏఎస్ అధికారిని అంటూ వచ్చి ఆత్మహత్య



తాడుకు వేలాడుతున్న దిల్ రంజన్ మృతదేహం

కొరాపుట్: ఒడిశా రాష్ట్రంలో అత్యున్నత ఒడిశా అడ్మిస్ట్రేటివ్ అధికారిని అని వచ్చి ఒక యువకుడు ఆత్మహత్యకి పాల్పడ్డాడు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మీరా ఆటో చౌక్ సమీపంలో శుభం అపార్ట్‌మెంట్‌లో సుందర్ గఢ్ జిల్లా బడగావ్‌కి చెందిన దిల్ రంజన్ పాటి (24) ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్యకి పాల్పడ్డాడు. తాను ఓఏఎస్‌కి క్వాలిఫై అయ్యానని చెప్పి అపార్ట్‌మెంట్‌లో ఇల్లు అద్దెకి తీసుకున్నాడు. రెండు నెలలుగా అక్కడే నివసిస్తున్నాడు. ఉదయం నుంచి తండ్రి ఫోన్ చేసినప్పటికీ ఎత్తక పోవడంతో అపార్ట్‌మెంట్ యజమానికి సమాచారం ఇచ్చాడు. యజమాని సూచనతో అపార్ట్‌మెంట్ గార్డు వెళ్లి కిటికీలో నుంచి చూడగా దిల్ రంజన్ ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌డీపీవో కృష్ణచంద్ర బోత్ర సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత మృతదేహాన్ని బయటకు తీస్తామని పోలీసులు వెల్లడించారు.

డుడుమా జలపాతంలో యూట్యూబర్ గల్లంతు



నదిలో కొట్టుకు పోతున్న యూట్యూబర్ సాగర్ కుడు

కొరాపుట్: ప్రఖ్యాత డుడుమా జలపాతంలో పడి యూట్యూబర్ గల్లంతయ్యాడు. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి వనక ఢిల్లి సమీపంలోని డుడుమా జలపాతంలో పడి బ్రహ్మపుర పట్టణానికి చెందిన యూట్యూబర్ సాగర్ కుడు (25) ఆదివారం గల్లంతయ్యాడు. సహచర బృందంతో కలిసి నది మధ్యలో డ్రోన్ సహాయంతో వీడియో చిత్రీకరణ జరుగుతుండగా.. ఇదే సమయంలో మాచ్‌ఖండ్ డ్యాం గేట్లు ఎత్తివేశారు. ఇది చూసిన పర్యాటకులు పెద్ద ఎత్తున్న కేకలు వేశారు. పరిస్థితి అర్థం చేసుకునే సరికి నీరు పోటెత్తింది. స్థానికంగా ఉన్న పర్యాటకులు రక్షించడానికి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేక పోయింది. దీంతో సాగర్ నది నుంచి 550 అడుగుల కిందకు వెళ్లి పోయాడు. ఇది తెలిసిన అగ్నిమాపక, ఒడ్రాఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఆదివారం రాత్రి వరకు అతని ఆచూకీ లభ్యం కాలేదు.

192 కిలోల గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలతో పోలీసు సిబ్బంది

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు శనివారం రాత్రి కటాపల్లి గ్రామ అడవి ప్రాంతంలో 192 కిలోల గంజాయితో ఉన్న బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం ఐఐసీ దీరాజ్ పట్నాయక్‌కు అటవీ ప్రాంతలో గంజాయి బస్తాలు ఉన్నట్టు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై మనోహర్ సాహు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బెజాంగ్‌వాడ పంచాయతీ కటాపల్లి గ్రామ అటవీ ప్రాంతానికి పంపించారు. పోలీసులు అటవీ ప్రాంతంలో గాలించి తొమ్మిది బస్తాల్లో ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన గంజాయి మాఫియా పరారైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలను బలిమెల పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ పది లక్షల రూపాయలు ఉంటుందని ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తెలిపారు.

అమరుల త్యాగం జాతి మరువదు

• రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి



ప్రసంగిస్తున్న మంత్రి సురేష్ పూజారి



అమర జ్యోతితో ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి సురేష్ పూజారి



అమరులకు నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

కొరాపుట్: స్వాతంత్ర్య పోరాటంలో బలి దానాలు ఇచ్చిన వారి త్యాగం జాతి మరువదని రాష్ట్ర రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి పేర్కొన్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి టురి నది వద్ద అమరుల స్మారక స్థూపం వద్ద జరిగిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1942 ఆగస్టు 24వ తేదీన టురి నదిని దాటడానికి ప్రయత్నం చేసిన స్వాతంత్ర్య పోరాట యోధులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 19 మంది అమరులయ్యారని గుర్తు చేశారు. వారి జ్ఞాపకార్థం ఏటా ఇక్కడ అమరులు కుటుంబాలతో సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి స్వాతంత్ర్య పోరాట యోధుల కుటుంబాల సంఘం ఆధ్వర్యంలో అమర జ్యోతితో ర్యాలీ జరిగింది. ఈ జ్యోతిని పపడాహండి వద్ద మంత్రి అందుకొని స్థూపం వద్ద వెలిగించారు. టురి నది వద్ద అమరులకు పిండ తర్పణం జరిగింది. సర్వమత ప్రార్థనతో ఆత్మశాంతి కోసం మౌనం వహించారు. పోలీసులు తుపాకులతో వందనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మహేశ్వర్ స్వయ్, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి,నర్సింగ్ బోత్ర,మనోహర్ రంధారి, మాజీ ఎంపీలు పరశురాం మజ్జి,భగవాన్ మజ్జి, ప్రముఖులు మున్నా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



వేదిక పై మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

• రక్తదానం.. ప్రాణదానం



రక్తం దానం చేస్తున్న దాత



రక్తదాతలకు ప్రశంసాపత్రాలతో సన్మానిస్తున్న నిర్వాహకులు

జయపురం: స్థానిక బ్రహ్మకుమారి ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జయపురం సోంబారుతోటలో గల బ్రహ్మకుమారి సేవాశ్రమ ప్రాంగణంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 29 యూనిట్ల రక్తం సేకరించారు. బ్రహ్మకమారి ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాన నిర్వాహక రాజయోగిణీ డాక్టర్ ప్రకాశమణి 18వ పుణ్యతిథి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్రహ్మకమారి ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. జయపురం జిల్లా కేంద్రం హాస్పిటల్ రక్తబండార్ టెక్నీషియన్‌లు రక్త దాతల నుంచి రక్తం సేకరించారు. జయపురం సబ్ డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌలో రక్తదాతల శిబిరాన్ని పర్యవేక్షించారు. రక్తదాతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు. బ్రహ్మకుమారి సేవాశ్రమ పరిచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా: ఆరుగురికి గాయాలు



గాయపడిన ఇద్దర్ బీహార్ కార్మికులు



ప్రమాదంలో నడుముకు గాయమైన కార్మికుడు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసు పరిధి ధనపూర్ అటవీ విభాగ డాక్ బంగ్లా సమీపంలో ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌తో సహా ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండగా వారిని జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అందిన వివరాల ప్రకారం బొయిపరిగుడ సమితిలో మెగా వాటర్ సప్‌లై ప్రాజెక్టులో ప్రతి గ్రామానికి పైప్‌లైన్ వేస్తున్నారు. ఆ పనులలో పనిచేసేందుకు బీహార్ నుంచి కార్మికులు వచ్చి ముండిగుడలో క్యాంపు ఏర్పరచుకున్నారు. ఆదివారం బలిగాం పంచాయతీలో పైపు పనులు చేసి ఒక వ్యాన్‌లో ఆరుగురు బీహారి కార్మికులు వస్తుండగా ధనపూర్ అటవీ విభాగ డాక్ బంగ్లా సమీపంలో అదుపు తప్పి వ్యాన్ బోల్తా పడింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మనోజ్ సాహు(26)తో పాటు ఆరుగురు బీహార్ కార్మికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వస్తున్న ఉపాధ్యాయుడు కనూచరణ్ బెహరాతో పాటు మరికొంతమంది క్షతగాత్రులను కాపాడి వారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ముగ్గురు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బొయిపరిగుడ ఏఎస్ఐ శివశంకర నాయిక్, రామగిరి పోలీసు పంటి ఏఎస్ఐ విష్ణు మడకామిలో సంఘటనా ప్రాంతానికి వెళ్లి ప్రమాదానికి లోనైన వ్యాన్‌ను సీజ్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

• బీజేడీ ఆందోళన



ధర్నాలో పాల్గొన్న బీజేడీ శ్రేణులు



ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి రబినారాయణ నందో



ధర్నాలో పాల్గొన్న మునిసిపాలిటీ వైస్ చైర్‌పర్సన్‌తో మహిళా కార్యకర్తలు

జయపురం: స్థానిక జయనగర్ కూడలి వద్ద జయపురం బీజేడీ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించిన ఈ ధర్నాలో ఒకటి, రెండో వార్డు ప్రజలు, బీజేడీ పార్టీ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ధర్నా సమయంలో ఈ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. ఈ ధర్నాలో మాజీ మంత్రి, రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు రబినారాయణ నందో పాల్గొని ప్రసంగించారు. జయపురం లక్ష్మీ ఇందిర పండా కూడలి నుంచి జయనగర్ మీదుగా పీహెచ్‌డీ ఆఫీసు వరకు గల 2.20 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఈ రోడ్డును బాగు చేయాలని ఎంతో కాలంగా తాము డిమాండ్ చేస్తున్నామని వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రోడ్లు, భవనాల విభాగం రూ.13.10 కోట్లు మంజూరు చేశారన్నారు. నేడు రోడ్డు పరిస్థితి అతి దారుణంగా ఉందన్నారు. రోడ్డు నిర్మాణంలో సంబంధిత వివిధ ప్రభుత్వ విభాగల మధ్య సమన్వయం లేకపోవటమే ఈ పరిస్థితికి కారణమని నిందించారు. ఈ రోడ్డు నిర్మాణంలో ఆర్అండ్‌బీ, మత్స్య, టాటా విద్యుత్, అటవీ, మైనర్ ఇరిగేషన్, జయపురం మునిసిపాలిటీ డిపార్టుమెంట్‌ల మధ్య సమన్వయం లేదన్నారు. నేటికీ ఈ మార్గంలో చెట్లు తొలగించడం జరగలేదని, రోడ్డు మధ్య గల విద్యుత్ స్తంభాలు తీయటం లేదని, జల విభాగ పైపులు తొలగించటంలేదని, ఉద్యానవన విభాగం స్థలం నివ్వడం లేదని, ఇతర ప్రభుత్వ విభాగాలు సహకరించకడం లేదన్నారు. దీంతో ఆర్అండ్‌బీ విభాగం రోడ్డు నిర్మాణంలో మార్పులు చేయలేకపోతుందని ఆరోపించారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు జరగటం లేదన్నారు. ఈ పరిస్థితికి కారణమైన వారిపై చర్యలు చేపట్టి, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డు పనులు పూర్తిచేయాలని, లేకపోతే బీజేడీ ప్రజాందోళన చేపడుతుందని హెచ్చరించారు. ధర్నాలో జయపురం మునిసిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్లు పి.పద్మా రెడ్డి, హరి మిశ్ర, మాధవ రథో, మాధవ మహంకుడొ, ఒకటో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి నాగరావు, నేతలు హరికృష్ణ, బాలా రాయి, మహేంద్ర అధికారి, చింటు పాణిగ్రాహి, జిల్లా పరిషత్ మాజీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కిత్తింగిలో ఉచిత వైద్య శిబిరం



కిత్తింగి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ సమితి బూదర పంచాయతీ కిత్తింగి గ్రామంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి హైటెక్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను ఆదివారం ఉదయం ప్రారంభించారు. కిత్తింగి గ్రామంలో ప్రజలు కొత్త జ్వరాలు, ఒళ్లు, కీళ్ల నొప్పులు వంటి అనేక రోజులుగా బాధపడుతుండటం చూసి హైటెక్ మెడికల్ కళాశాల (భుభనేశ్వర్) నుంచి ఉచిత వైద్య శిబిరంను గ్రామంలో ఏర్పాటుచేశారు. కిత్తింగి, ఖండవ గ్రామాలలో రోగులకు హైటెక్ మెడికల్ నుంచి వచ్చిన డాక్టర్లు అనేక పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత మెడికల్ శిబిరానికి జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, కాశీనగర్ సగర పంచాయితీ వైస్ చైర్మన్ రఘురాం సాహు, కాశీనగర్ ఎస్.ఏ.సి. డాక్టర్ సౌమ్యరంజన్ దాస్ తదతరులు శిబిరంలో పాల్గొని సహకరించారు.



కాశీనగర్ బ్లాక్ కిత్తింగిలో ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రూపేష్

పురపాలక లెవనే విజేత



మీడియా వెర్సస్ పురపాలక లెవన్ క్రికెట్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



క్రికెట్ మ్యాచ్ ఆటగాళ్లకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే రూపేష్



బ్యాటింగ్ చేస్తున్న పురపాలక చైర్మన నిర్మలా శెఠి

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సుపరిపాలన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో జిల్లా మీడియా అలయెన్సు వెర్సస్ పురపాలక టీం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ క్రికెట్ మ్యాచ్‌ను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ముఖ్యఅతిథిగా విచ్చేసి తొలుత బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. పర్లాకిమిడి పుపపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి కూడా బ్యాటింగ్ చేసి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మీడియా లెవన్ నిర్ణీత 15 ఓవర్లకు ఆరు వికెట్ల నష్టానికి 96 పరుగులు చేయగా, తదుపరి బ్యాటింగ్‌లో పురపాలక లెవన్ జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి విజయం సాధించారు. అంపైర్లుగా మిట్టు పాఢి, శ్రీకాంత్ మహారాణా వ్యవహారించారు. పురపాలక సిబ్బందికి విన్నర్ కప్, మీడియాకు రన్నర్ కప్‌ను ఆగస్టు 31 స్థానిక సంస్థల సుపరిపాలన దినోత్సవం నాడు ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో పురపాలక ఈ.ఓ. లక్ష్మణ ముర్ము, జె.ఈ.లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారును ఢీకొట్టిన ట్రాక్టర్



దెబ్బతిన్న కారు ముందుభాగం

నరసన్నపేట: మండల కేంద్రం గాంధీనగర్ కూడలిలో పోలాకి వెళ్లే దారిలో ఆదివారం ఉదయం కారును ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జుగా మారింది.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు



పట్టుబడిన పశువుల వ్యాన్

కవిటి: కొజ్జీరియా టోల్‌ప్లాజా వద్ద పశువుల అక్రమ రవాణాను కవిటి పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం ఒడిశావైపు నుంచి విజయనగరంలోని అలమండ పశువుల సంతకు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేయగా 14 దున్నపోతులు, 2 గేదెలు ఉన్నట్టు గుర్తించారు. వీటిని కంచిలి మండలం గొల్లకంచిలికి చెందిన గణప వాసులు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి పశువులను కొత్తవలసలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ అప్పగించినట్లు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో హేమశ్రీ ప్రతిభ



వెయిట్‌లిఫ్ట్ చేస్తున్న డి.హేమశ్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన డి.హేమశ్రీ సత్తాచాటింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని దక్కించుకుంది. హేమశ్రీ స్వస్థలం బూరవెల్లి గ్రామం. డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఇటీవలే ఖేలో ఇండియా మహిళల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ 53 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి శభాష్ అనిపించుకుంది.

నీట్‌లో బోరుభద్ర విద్యార్థినుల ప్రతిభ

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్రకు చెందిన ముగ్గురు విద్యార్థినులు నీట్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మార్పు కోమలి, మార్పు హస్వతో పాటు అదే గ్రామానికి చెందిన వజ్జ యోషిత ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. మార్పు కోమలి, హస్వల తండ్రి శ్రీనివాసరావు విశాఖ పట్నంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా తల్లి సీత గృహిణి. అలాగే వజ్జ యోషిత తండ్రి నరసయ్య హరిశ్చంద్రపురం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా తల్లి నీరజ గృహిణి.

జీపీఎస్ పరికరాల పంపిణీలో చేతివాటం

సంతబొమ్మాళి: భావనపాడులో మత్స్యకారులకు అందజేసిన జీపీఎస్ పరికరాల పంపిణీలో చేతివాటం ప్రదర్శించారు. ఈ నెల 21వ తేదీన భావనపాడులో ముందుగా నమోదు చేసుకున్న బోట్లు ఉన్న 88 మంది మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలను అధికార పార్టీ నాయకుల సమక్షంలో మత్స్యశాఖ అధికారులు అందజేశారు. ఒక్కో జీపీఎస్ పరికరానికి రూ. 400 చొప్పున రూ. 35,200 కలెక్షన్ చేశారు. డబ్బులు ఇవ్వలేదని కొందరు మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలు ఇవ్వడానికి అధికార పార్టీ నాయకులు నిరాకరించారు. దీంతో గత్యంతరం లేక డబ్బులను చెల్లించి పరికరాలను తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కొందరు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఉచితంగా పరికరాలను ఇస్తుంటే ఇక్కడ డబ్బులు తీసుకోవడంపై కొందరు నిలదీశారు.

రెండోరోజూ కొనసాగిన విజిలెన్స్ దాడులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో వరుసగా రెండో రోజు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడు లు కొనసాగాయి. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలు జిల్లాలో ఎనిమిది చోట్ల సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. మన జిల్లాతో పాటు విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో 15 చోట్ల జరిగాయి. విజయనగరం పట్టణంలో శ్రీమాతా వెంకటేశ్వరరావు అండ్ సన్స్ రికార్డులు సక్రమంగా లేనందున రూ. 2.47 లక్షల విలువైన 4.35 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అమ్మకం నిలుపుదలకు సిఫా ర్సు చేశారు.

కరకట్ట.. కనికట్టు!

- ముంపునకు గురవుతున్న వంశధార తీర గ్రామాలు
- వర్షమొస్తే వణుకుతున్న నదీ పరివాహక ప్రజలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

హిరమండలం/సరుబుజ్జిలి: – హిరమండలం మండలం గులుమూరు గ్రామం వంశధార నదిని ఆనుకుని ఉంటుంది. గొట్టా బ్యారేజీకి ముందు కూతవేటు దూరంలో ఉంది. ఎప్పుడు వంశధార ఉప్పొంగినా నీరు గ్రామంపైకి పోటెత్తుతుంది. అక్కడ కరకట్ట లేకపోవడంతో ఏటా వరదల సమయంలో ఆ గ్రామం చిగురుటాకులా వణికిపోతుంది.

● హిరమండలం మండలం పిండ్రువాడ, భగీరథపురం, మహాలక్ష్మీపురం గ్రామాల పరిధిలో పంట పొలాలకు ఏటా వరద ముంపు తప్పడం లేదు. వర్షాలు, వరదల సమయంలో గొట్టా బ్యారేజీ గేట్లు అన్నీ ఎత్తివేస్తారు. ఆ సమయంలో నీరు తీర గ్రామాల పొలాలపై పడుతుంది. ఇసుక మేటలు వేసి పంటలకు తీరని నష్టం కలుగుతుంది. కరకట్టలు లేకపోవడంతో ఏటా పంటలకు నష్టాలు తప్పడం లేదు.

● ఎల్‌ఎన్‌పేట మండలంలోని ఎల్‌ఎన్‌పేట, మిరియాబిల్లి, వాడవలస, దబ్బపాడు గ్రామాలు వంశధార తీరంలో ఉంటాయి. ఏటా వంశధార తీరం కోతకు గురై ఈ గ్రామాలతో పాటు పంట పొలాల్లోకి వరద నీరు చేరుతుంది. రోజుల తరబడి నిల్వ ఉండిపోతుంది. పంటలకు నష్టం వాటిల్లుతోంది. అదే కరకట్టలు ఉంటే ఈ పరిస్థితి ఉండదు. ఈ సమస్య ఈ రెండు మండలాల్లోనే కాదు.. దాదాపు 10 మండలాల వరకూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వంశధారకు వరదొస్తే తీర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. నదిలో నీటి మట్టం పెరిగే కొద్దీ ఆయా గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలు అయిన మోహన, గుణుపూర్ ప్రాంతాల్లో వర్షాలు పడితే నదిలో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోతుంది. దీంతో ఎక్కడికక్కడే నదీ తీరం కోతకు గురై సమీప గ్రామాలు, పంట పొలాల్లోకి నీరు చొచ్చుకెళుతుంది. పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి ఇబ్బందికరంగా మారుతుంది. వేలాది ఎకరాల పంటలు ఏటా దెబ్బతింటాయి. అయితే ఈ సమస్యకు కరకట్టల నిర్మాణంతో చెక్ చెప్పవచ్చు. కానీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం తీర గ్రామాల ప్రజలకు శాపంగా మారింది.

ఇదీ పరిస్థితి..


జిల్లాలో వంశధార నదీ పరివాహక గ్రామాలుగా కొత్తూరు మండలంలో 14, హిరమండలంలో 10, ఎల్‌ఎన్‌పేటలో 3, సరుబుజ్జిలిలో 4, ఆమదాలవలసలో 5, శ్రీకాకుళం రూరల్‌లో 3, గారలో 4, జలుమూరులో 19, నరసన్నపేటలో 12, పోలాకి మండలంలో 12 గ్రామాలు ఉన్నాయి. ఏటా వర్షాలు, వరదల సమయంలో ఈ గ్రామాలకు భారీగా నష్టం జరుగుతోంది. 2018 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం కరకట్టలంటూ హడావుడి చేసింది. ఎన్నికల స్టంట్‌గా మార్చింది. వంశధార నదికి ఇరువైపులా కరకట్టల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొత్తం 4 ఫేజ్‌లుగా విభజించి పనులు మొదలుపెట్టింది. భామిని, కొత్తూరు, హిరమండలం మండలాల్లో మొదటి ప్యాకేజీ కింద.. ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి రెండో ప్యాకేజీ కింద.. ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్, గార మూడో ప్యాకేజీ కింద.. నరసన్నపేట, జలుమూరు, పోలాకి నాలుగో ప్యాకేజీ కింద విభజించారు. తొలి ప్యాకేజీకి సంబంధించి టెండర్లు ఖరారు చేసి కేవలం 10 శాతం పనులు పూర్తిచేసి విడిచిపెట్టారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వంశధార ఫేజ్-2 రిజర్వాయర్, గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం, ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాలను ప్రాధాన్యతాంశాలుగా భావించింది. దీంతో టీడీపీ ఆరంభశూరత్వంగా చేపట్టిన కరకట్టల జోలికి వెళ్లలేదు. అయితే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కరకట్టల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని టీడీపీ కూటమి నేతలు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ ఎటువంటి సన్నాహాలు చేయలేదు. దీంతో ఈ ఏడాది కూడా వంశధార తీర గ్రామాల ప్రజలకు ఆందోళనలు తప్పడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఎల్‌ఎన్‌పేట వద్ద అసంపూర్తిగా కరకట్టల నిర్మాణం



పురుషోత్తపురం వద్ద శిథిలమైన రాతికట్ట



వరదలకు నీటమునిగిన పంటపొలాలు(ఫైల్)

పొంచి ఉన్న ముప్పు..

సరుబుజ్జిలి మండలంలోని అగ్రహారం, పాతపాడు, తెలికిపెంట, యరగాం, కాగితాపల్లి, పెదమాలపేట, పెద్దసవలాపురం, చినవెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట తదితర గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, కొరపాం, బెలమాం, లొద్దలపేట, ముద్దాడపేట, కలివరం, తొగరాం, పొందూరు మండలం సింగూరు, బొడ్డేపల్లి, బూర్జ మండలం ఖండ్యాం, గుత్తావల్లి, నారాయణపురం గ్రామాలు నష్టాలు చవిచూస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్నాం



నదిలో ఏ మాత్రం ప్రవాహం పెరిగినా వరద నీరు గ్రామంలోకి వస్తోంది. దీంతో పంటనష్టం కలుగుతోంది. కరకట్ట నిర్మాణం చేయకపోవడవం వల్ల విలువైన భూములు, ఇళ్లు కోల్పోతున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించాలి.

–బి.మల్లేశ్వరరావు,
పాతపాడు, సరుబుజ్జిలి మండలం

అనుమతులు రావాలి..

ఈ విషయమై కరకట్టల విభాగం ఈఈ వాసుదేవరావు మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాలు వలన కరకట్ట పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు విషయమై అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఏటా పంట నష్టం



ఏటా వంశధార వరద పోటుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు పనులు ప్రారంభించి పూర్తిచేయాలి. 2019 ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించింది. ఇప్పుడు ఆ కరకట్టల నిర్మాణం గురించి పట్టించుకోకపోవడం దారుణం.

– ముద్దాడ లక్ష్మణరావు,
దబ్బపాడు, ఎల్‌ఎన్‌పేట మండలం

టీడీపీదే బాధ్యత



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంశధార ఫేజ్ 2 రిజర్వాయర్ నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చింది. గొట్టా బ్యారేజీలో ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ప్రారంభించింది. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి సైతం చేపట్టింది. అందుకే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రారంభించిన కరకట్టల నిర్మాణం పూర్తిచేయాల్సిన బాధ్యత ఉంది.

– మీసాల భాస్కరరావు,
రైతు, భగీరథిపురం, హిరమండలం

పేకాట శిబిరాలపై దాడి

రణస్థలం: జె.ఆర్.పురం సమీపంలోని ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.61,650 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రణస్థలం: లావేరు మండలం జి.జి.వలస సమీప తోటలోని పేకాట శిబిరంపై లావేరు పోలీసులు దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రూ.15,310 స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎచ్చెర్ల: అల్లినగరంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.7,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల: కుశాలపురం బైపాస్ రోడ్డు సమీపంలో ఈ నెల 17 న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన లక్ష్మణ్ (65) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఇతను ఈ ప్రాంతంలో ప్లాస్టిక్ బాటిళ్లను సేకరిస్తూ ఉండేవాడు. రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. గాయాలైన లక్ష్మణ్‌ను తొలుత చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: బెల్లుపడ సమీపంలో పాత టోల్ ప్లాజా వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, నీలం నిక్కరు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడు యాచకుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. బెల్లుపడ వీఆర్‌ఓ చాముండేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్ఛాపురం పట్టణ ఎస్‌ఐ ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్నబాబుకు పరామర్శ



నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. కాకినాడలోని ఆయన కుటుంబాన్ని ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, ఆమదావలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, రాష్ట్ర కళింగ వైశ్య కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పోలినాటి వెలమ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్, ఎన్ని ధనుంజయ తదితరులు పరామర్శించారు.

సెప్టెంబర్ 14న అంగన్‌వాడీ మహాసభలు



మాట్లాడుతున్న సీహెచ్ అమ్మన్నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సెప్టెంబరు 14న పాతపట్నంలో నిర్వహించనున్న అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వేతనాల పెంపు, డీఏ, పీఆర్‌సీ, సంక్షేమ పథకాల వర్తింపు, యాప్‌ల భారం తగ్గింపు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యూనియన్ నాయకులు పి.లతాదేవి, బి.శాంతామణి, కె.వి.హేమలత, బి.సునీత, పొన్నాడ.భూలక్ష్మి, కె.మాధవి, పి.కళావతి, కె.నారాయణమ్మ,, హేమ, ఉమ పాల్గొన్నారు.

ఆదిత్యా నమోస్తుతే..!



దర్శనానికి బారులు తీరిన భక్తులు



క్యూలైన్లలో భక్తజనం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి కొలువైన అరసవల్లి ఆదివారం భక్తజనంతో కిటకిటలాడింది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించగా.. మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణతో ఈ పూజలు నిర్వహించారు. అంతరాలయంలో భక్తులకు ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ అనుమతించారు.

అవస్థలపై ఫిర్యాదులు..

దర్శనాల విషయంలో పలువురు భక్తులు ఈఓ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కేశఖండన శాలలో టిక్కెట్ల ధరకు మించి వసూళ్లు చేస్తున్నారని చెప్పారు. సూర్యనమస్కారాల పూజల వద్ద ఎక్కువ సమయం కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నామని, పీటలు వంటివి ఏర్పాటు చేస్తే అవసరమైన భక్తులకు వీలుగా వినియోగపడతాయనే అంశాన్ని ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఒక్కొక్కరికి రూ.300 చొప్పున సూర్యనమస్కారాల పూజలకు వసూలు చేస్తున్నారని, దంపతులకు ఒకే టికెట్‌ను నిర్ణయించాలని కోరారు. వీటిని పరిశీలించి తప్పనిసరిగా అమలు చేస్తామంటూ ఈవో బదులిచ్చారు. కేశఖండన శాలలో అదనపు వసూళ్లు చేస్తున్న క్షురకుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తామని చెప్పారు.

యువకుడికి కత్తిపోట్లు



గాయపడిన రాజశేఖర్

జి.సిగడాం : గెడ్డకంచరాం గ్రామంలో ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గెడ్డకంచరాం గ్రామానికి చెందిన పుక్కల రాజశేఖర్, గొబ్బూరు గ్రామానికి చెందిన దమరసింగి శంకర్(గొల్లాజీ) స్నేహితులు. ఇద్దరూ కలిసే పెయింటింగ్ పనులకు వెళ్తుంటారు. ఆదివారం గెడ్డకంచరాంలో అప్పన్న అనే వ్యక్తి ఇంట్లో జరిగిన శుభకార్యానికి ఇద్దరూ వెళ్లారు. ఈ క్రమంలో మద్యం బాటిల్ విషయమై గొడవ జరిగింది. అనంతరం ఇద్దరూ బయటకు వచ్చేసి బాతువ– గెడ్డకంచరాం కూడలి వద్ద మరోసారి గొడవపడ్డారు. ఈ సమయంలో రాజశేఖర్ కింద పడిపోయాడు. శంకర్ వెంటనే ద్విచక్ర వాహనంలో ఉన్న కత్తి తీసి రాజశేఖర్ కడుపులో పొడిచాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి జి.సిగడాం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

కాపర్ వైర్లు చోరీ

నరసన్నపేట: తెలగవలసలో వ్యవసాయ బోర్లకు చెందిన కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్యానల్ బోర్డు నుంచి స్టాటర్‌కు, స్టాటర్ నుంచి మోటారు వద్దకు వెళ్లే వైర్లు కట్ చేసి పట్టుకుపోయారు. వీటి విలువ రూ.20 వేలు ఉంటుందని అంచనా. కాపర్ వైర్ల చోరీ వల్ల వ్యవసాయ బోర్లు వినియోగించుకోలేకపోతున్నామని బాధిత రైతులు ముద్దాడ నాగేశ్వరరావు, గణేశ్వరరావు, సింహాచలం, భాస్కరరావు, బలరాం, వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ ఎంపికలు



ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు అన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్స్ మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడా మైదానం వేదికగా ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చి తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ మాట్లాడుతూ గుంటూరు జిల్లా సత్తెనపల్లి వేదికగా ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఇక్కడ ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, సబ్ రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజు, జిల్లా పీఈటీ–పీడీ సంఘ అధ్యక్షుడు పి.తవిటయ్య, సహాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, ఎస్.జీ.ఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, హెచ్‌ఎం కె.హరిబాబు, సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, గురుగుబెల్లి రాజశేఖర్, ఎ.డిల్లేశ్వరరావు, ఆర్కే మహంతి, మల్లేష్, పీడీలు పాల్గొన్నారు.

పీడీ–పీఈటీ సంఘానికి రూ.లక్ష వితరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం పీడీ–పీఈటీ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఒలింపిక్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అభివృద్ధికి బాసటగా నిలిచారు. నగరంలోని టీపీఎంహెచ్ స్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవలి ఉద్యోగ విరమణ చేసిన చేసిన సాంబమూర్తి తనవంతుగా రూ.లక్ష వితరణగా అందజేశారు. ఆదివారం జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ ముఖ్య సలహాదారు పి.సుందరరావు, జిల్లా అధ్యక్షుడు పి.తవిటయ్య, ప్రధాన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ పరికరాల పంపిణీలో చేతివాటం

సంతబొమ్మాళి: భావనపాడులో మత్స్యకారులకు అందజేసిన జీపీఎస్ పరికరాల పంపిణీలో చేతివాటం ప్రదర్శించారు. ఈ నెల 21వ తేదీన భావనపాడులో ముందుగా నమోదు చేసుకున్న బోట్లు ఉన్న 88 మంది మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలను అధికార పార్టీ నా యకుల సమక్షంలో మత్స్యశాఖ అధికారులు అందజేశారు. ఒక్కో జీపీఎస్ పరికరానికి రూ. 400 చొప్పున రూ. 35,200 కలెక్షన్ చేశారు. డబ్బులు ఇవ్వలేదని కొందరు మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలు ఇవ్వడానికి అధికార పార్టీ నాయకులు నిరాకరించారు. దీంతో గత్యంతరం లేక డబ్బులను చెల్లించి పరికరాలను తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని కొందరు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

- కరిగిపోతున్న పెద్దకొండ
- పట్టించుకోని అధికారులు



అక్రమంగా తరలిపోతున్న గ్రావెల్



సంతబొమ్మాళిలో అనుమతులు లేకపోయినా గ్రావెల్‌ను తవ్వేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలం కేంద్రం సంతబొమ్మాళిలో తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పెద్దకొండను అక్రమార్కులు కొల్లగొట్టేస్తున్నారు. యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలించుపోతున్నారు. రోజుకు వందలాది లోడుల ను ట్రాక్టర్‌తో రవాణా చేస్తున్నారు. మొదట్లో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో మరింత బరితెగించారు. జేసీబీతో కొండను తవ్వేస్తూ రోడ్డు నిర్మాణ పనుల పేరిట గ్రావెల్‌ను పట్టపగలు దర్జాగా ఆర్అండ్‌బీ రోడ్డు మీదుగా తరలించుకుపోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకపో యినా రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా రు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోర్టు నిర్మాణానికి టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలించినప్పుడు కొందరు స్థానికులు అడ్డుకోవడంతో నిలిచిపోయింది. ఇప్పుడు కొన్ని రోజులుగా ప్రైవేటు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా రోజుకు వందల లోడ్లును తరలించుకుపోతున్నా మైన్స్, రెవెన్యూ అధికారులు బోధ్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెద్దకొండ కరిగిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతులు లేవు..

సంతబొమ్మాళి పెద్దకొండ నుంచి గ్రావెల్ తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవు. గతంలో రెండు సార్లు చెప్పినా పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణం పేరిట తరలించుకుపోతున్నారు.

– భాస్కరరావు, వీఆర్వో, సంతబొమ్మాళి

రాష్ట్ర పోటీల్లోనూ సత్తాచాటాలి

శ్రీకాకుళం న్యూకాలనీ:

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సమష్టిగా రాణించి విజయబావుటా ఎగురవేయాలని ఎచ్చెర్ల ఏఆర్ ఎస్సై గంధం సత్యనారాయణ పేర్కొన్నారు. ఐదేళ్లగా బాల్ బ్యాడ్మింటన్‌లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తు రాష్ట్ర,జాతీయస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ నెల 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరు వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే సబ్ జూనియర్స్, సీనియర్స్ బాలబాలికల జట్లకు క్రీడాదుస్తులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గంధం అజయ్ పావని దంపతులు, సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో రాణించిన తలవరం విద్యార్థిని



సంజనకు జ్ఞాపిక అందజేస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

వీరఘట్టం: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సంజన ప్రతిభ కనబరిచింది. తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడు వద్ద యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో సంజన మూడో స్థానంలో నిలిచినట్లు యోగా గురువు జనార్దనరావు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన సంజనకు యోగాసన అసోసియేషన్ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. హెచ్ఎం ఎస్.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.రఘు, ధనలక్ష్మి, తదితరులు సంజనను అభినందించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో పందెంరాయుళ్లు

బొబ్బిలి రూరల్: మండలంలోని పాతపెంట గ్రామ సమీపంలోని తోటలో గొర్రెపందాలు నిర్వహిస్తున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సైలు రమేష్, జ్ఞానప్రసాద్, సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు చేపట్టగా పది మంది పట్టుబడ్డారన్నారు. వారి వద్దనుంచి రెండు వేల రూపాయల నగదు.. రెండు పొట్టేళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా పూర్ణాహుతి



సూర్యసదనంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడిలోని గర్భాం రోడ్డులో గల సూర్య సదనంలో ఆదివారం పూర్ణాహుతి మహోత్సవం వైభవంగా జరిగింది. సూర్యసదనం ప్రధాన అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ రామానంద భారతిస్వామి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్త ఇప్పిలి శంకర్‌శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పక్కాగా విద్యాహక్కు చట్టం



మాట్లాడుతున్న ఆపుస్మా లీగల్ అడ్వైజర్ విజయ్

విజయనగరం అర్బన్: విద్యాహక్కు చట్టం పక్కాగా అమలు చేయాలని, చట్టంలో నిర్దేశించినవి అమలయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ అన్ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ఆపుస్మా) లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ్ కోరారు. స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగిన అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 12(1)(సి) చట్టం ప్రకారం ఇస్తున్న అడ్మిషన్లను గౌరవిస్తున్నామని, సెక్షన్ 12(2) ప్రకారం ఫీజులు నిర్ణయించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రైవేటు స్కూళ్లకు స్టార్ రేటింగ్స్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. మూడేళ్లుగా ప్రవేశాలు ఇచ్చినా ఫీజులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తున్నామన్నారు. సమావేశంలో అసోసియేషన్ రిజిస్ట్రేషన్, సభ్యత్వ చందాలు, సబ్ కమటీలు, మేనేజ్‌మెంట్ ఎనరిచ్‌మెంట్ ప్రోగ్రాంలపై తీర్మానాలు చేసి వాటిని ఆమోదించారు. సమావేశంలో అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు ఎంవీరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంఏఎస్ వెంకటరావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏఆర్ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం

విజయనగరం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఐనాక్స్ భవన సముదాయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్(బిడ్డకు తల్లిపాలు ఇచ్చే గది) ఆదివారం ప్రారంభించారు. మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో బిడ్డకు తల్లిపాలు ఇచ్చేందుకు అసౌకర్యవంతంగా ఉండడంతో ఇలా ప్రత్యేకంగా ఓ గదిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మార్వాడీ యువమంచ్ మహిళా విభాగం విశాఖ చైర్‌పర్సన్ జై శ్రీహిరావత్ తెలిపారు. ప్రతి పట్టణంలో రద్దీగా ఉండే చోట మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఈ గదుల ఏర్పాటు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మార్వాడీ యువమంచ్ విజయనగరం అధ్యక్షుడు అభిషేక్ శర్మ, అభిజ్ఞ, దీపాశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతికి నచ్చేలా.. వినాయకుడు మెచ్చేలా..!

- మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న పాల్తేరు కళాకారులు
- తర తరాలుగా ఇదే వృత్తిలో రాణిస్తున్న కుమ్మరి కులస్తులు
- పాల్తేరు విగ్రహాలకు డిమాండ్



కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న విగ్రహాలు

బాడంగి: మట్టి వినాయక విగ్రహాలకు మండలంలోని పాల్తేరు పెట్టింది పేరు. గ్రామానికి చెందిన కుమ్మరి కులస్తులు తరతరాలుగా మట్టి వినాయక, దుర్గాదేవి, నందీశ్వరులు, పార్వతీపరమేశ్వరుల విగ్రహాల తయారీతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. వీరు తయారు చేసే విగ్రహాలకు మార్కెట్‌లో ఎనలేని డిమాండ్ ఉంది. తరతరాలుగా వీరు మట్టి కుండలతో విగ్రహాలు తయారు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వీరు విగ్రహాలు తయారు చేయడం విశేషం. కేవలం బంక మట్టితో పాటు సంప్రదాయ రంగులను మాత్రమే వాడుతారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విగ్రహాలు కొనుగోలు చేస్తారంటే వీరి పనితనం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇటీవల కాలంలో చాలా మంది తక్కువ ధరకు లభించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే బొమ్మల వైపు దృష్టి సారించడంతో వీరి వ్యాపారం కాస్త తగ్గింది. గతంలో వినాయక చవితి సీజన్‌లో ఒక్కో కుటుంబం వారు సుమారు రెండు లక్షల రూపాయల వరకు వ్యాపారం చేయగా.. ఈ ఏడాది మాత్రం అంత పెద్ద ఆర్డర్లు రాలేదని కళాకారులు చెబుతున్నారు. లాభాలు గడించాలంటే తాము కూడా పర్యావరణానికి చేటుచేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు తయారు చేసేవారమని.. అయితే ప్రకృతిని దృష్టిలో పెట్టుకుని, పూర్వీకులు చెప్పిన మాట ప్రకారం లాభాలు తక్కువ వచ్చినా మట్టి విగ్రహాలనే తయారు చేస్తున్నామని తెలిపారు. తమలాంటి కళాకారులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందితే మరింతగా రాణిస్తామని చెబుతున్నారు.



మట్టితో వినాయకుడ్ని తయారు చేస్తున్న శ్రీనివాసరావు




శివగణపతి బొమ్మకు మెరుగులు దిద్దుతున్న శంకరరావు

ఆర్డర్లు తక్కువ..



గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఆర్డర్ల సంఖ్య తగ్గింది. మట్టి వినాయక విగ్రహాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. పర్యావరణానికి చేటుచేసే ఎటువంటి రసాయనాలు ఉపయోగించం. లాభం తక్కువ వచ్చినా మట్టి బొమ్మలనే తయారు చేస్తుంటాం. మేము తయారు చేసే విగ్రహాలకు జిల్లా వ్యాప్తంగా పేరుంది. – అమలాపురం శ్రీనివాసరావు, మట్టి విగ్రహాల కళాకారుడు, పాల్తేరు గ్రామం

ప్రోత్సాహం కరువు..



మాలాంటి కళాకారులను ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తాం. ప్రస్తుతం పోలీసు నిబంధనలు ఎక్కువ కావడంతో ఉత్సవాల నిర్వహణకు యువత ఆసక్తి కనబరచడం లేదు. అధికారులు, పర్యావరణ ప్రేమికులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తే మట్టి బొమ్మలకు గిరాకీ ఉంటుంది. మాలాంటి కళాకారులకు న్యాయం జరుగుతుంది. – సుంచెల సత్యనారాయణ, మట్టివి గ్రహాల కళాకారుడు, పాల్తేరు గ్రామం

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి నగరంలోని విజ్జి స్టేడియంలో అండర్-17 విభాగంలో బాల, బాలికలకు ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2009 జనవరి 1 నుంచి 2012 డిసెంబర్ 31 మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులన్నారు. అంతేకాకుండా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు, జనన ధ్రువీకరణపత్రం కలిగి ఉండాలని సూచించారు. క్రీడాకారులు తమ వ్యక్తిగత క్రీడా పరికరాలతో పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 30 నుంచి పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 83747 37707 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శారీరక చురుకుదనం లేకపోతే సమస్యలు

- ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి



సండే ఆన్ సైకిల్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది

పార్వతీపురం రూరల్: ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవన శైలిలో ద్విచక్ర వాహనాలు, కార్లు భాగమైపోవడంతో శారీరక శ్రమ ఉండడం లేదని ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి అన్నారు. శారీరక చురుకుదనం లేకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. క్విట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండే ఆన్ సైకిల్ పేరిట ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ కార్యాలయం నుంచి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ప్రతిరోజూ విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటారన్నారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరక దృఢత్వం వస్తుందని చెప్పారు. ర్యాలీలో ఏఆర్‌ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్సైలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



రాఘవ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీర రాఘవ (29) పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగొడబ గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకునిగా పనిచేస్తున్నాడు. అయితే రాఘవకు వచ్చే జీతం కన్నా ఖర్చులు ఎక్కువ కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండలంలోని ఆరికతోట పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాడంగి సీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆస్పత్రి ఆవరణలో మృతదేహం

విజయనగరం క్రైమ్ : స్థానిక సర్వజన ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆస్పత్రి సిబ్బంది ఆదివారం గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ ఆర్‌వీకే చౌదరి ఆదేశాలతో హెచ్‌సీ అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మద్యం మత్తులో మృతి చెందాడా.. లేక ఇతర కారణాల వల్ల చనిపోయాడా అన్నది తేలాల్సి ఉంది. మృతుడు నీలిరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అప్పలాచారి మృతదేహం

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సర్వజన ఆస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సీఆర్ నగర్‌కు చెందిన దేవు అప్పలాచారి (59) ఈ నెల 23వ తేదీన ఇంటిలో మెట్లపైనుంచి జారిపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశాడు. మృతుడి కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదీ తీరంలో హెచ్చరిక బోర్డులు : సబ్ కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని: మండలంలోని లివిరి వద్ద వంశధార నదిలో కుమ్మరి లక్ష్మి అనే మహిళ గల్లంతు కాగా ఆ నదీతీరాన్ని పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం పరిశీలించారు. మహిళ గల్లంతు ఘటనపై ఆరాతీశారు. తహసీల్దారు శివన్నారాయణ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నదిలో జల్లెడ పడుతున్నా మహిళ ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ప్రమాదకరంగా ఉండే ఇటువంటి నదీతీరాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దారును సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఆదివారమూ ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యేక బోటు వేసుకుని మరీ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

వేధింపుల వల్లే ఆత్మహత్య

గజపతినగరం రూరల్: మండలంలోని పిడిశీలకు చెందిన కర్రోతు సాయిసుధ ఆత్మహత్యకు ప్రియుడి వేధింపులే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సాయిసుధకు అదే గ్రామానికి చెందిన యడ్ల ఈశ్వరరావుతో 11 ఏళ్లుగా పరిచయం ఉందన్నారు. కొద్దిరోజులుగా ఈశ్వరరావు నుంచి వేధింపులు ఎక్కువ కావడంతో సాయిసుధ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించండి

విజయనగరం అర్బన్: బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని, వారిని బోధనకే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పైడిరాజు కోరారు. స్థానిక ఏపీటీఎఫ్ సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఎఫ్, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేటీ కమిటేషన్ చెల్లించాలని, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించి పీఆర్‌సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయుడుని ఆందోళనకు గురిచేయకుండా ప్రశాంతంగా పాఠశాలలో విద్యను బోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సామాజిక చైతన్యమే లక్ష్యం

విజయనగరం అర్బన్: సామాజిక చైతన్యం కలిగించడమే జనవిజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల కృష్ణారావు అన్నారు. స్థానిక గురజాడ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇకపై జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాలు ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలను చైతన్యపరుస్తూ వారిలో సామాజిక స్పృహ కలిగించేలా కృషి చేస్తామన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య

- రిజర్వ్ బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య

విజయనగరం: సైబర్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఎటువంటి వ్యక్తిగత సమాచారం చేరవేయవద్దని రిజర్వ్ బ్యాంక్ సీజీఎం సుబ్బయ్య సూచించారు. యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో 'బ్యాంకింగ్ సేవలు – సైబర్ మోసాలపై' ద్వారపూడి గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు, సామాజిక భద్రతా పథకాలను ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ షాలిని, రిజర్వ్‌బ్యాంక్ డీజీఎం కల్యాణ చక్రవర్తి, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ జితేంద్ర శర్మ, ద్వారపూడి సర్పంచ్ అదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు మృణాళిని, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట రమణమూర్తి, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు రాజా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదే..

- ఎస్పీ వకుల్ జిందల్



వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: వినాయక ఉత్సవాల్లో అల్లర్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఎక్కడైనా అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మంటపాల ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీస్, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాలు సాఫీగా సాగేందుకు పోలీస్ సూచనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మంటపాలు ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఉత్సవాల్లో డీజేలను వినియోగించేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. మైక్‌సెట్లను నిర్ణీత సమయం వరకు మాత్రమే వేయాలని చెప్పారు. అలాగే సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనంలో ప్రమాదకర రంగులు చల్లుకోవడం.. బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సభ్యులపై చర్యలు తప్పవన్నారు.

కురుపాం విద్యార్థిని లాత్వికకు ఫ్రీ మెడికల్ సీటు

- మొదటి ప్రయత్నంలోనే గుంటూరులోని కాటూరి కళాశాలలో సీట్



కాదా లాత్విక

కురుపాం: కురుపాం మండల కేంద్రానికి చెందిన కాదా లాత్విక ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించింది.ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలోని బీసీ(బి) కేటగిరిలో మొదటి ప్రయత్నంలోనే 463 మార్కులు సాధించి 3743వ ర్యాంకును కైవసం చేసుకుని గుంటూరు లోని కాటూరి మెడికల్ కళాశాలలో ఫ్రీ సీటు సాధించింది. లాత్విక తండ్రి కాదా చంద్రమౌళి సాక్షి దిన పత్రిక కురుపాం రిపోర్టర్ గా, తల్లి అనూరాధ జియ్యమ్మవలస మండలంలోని రావాడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. మొదటి ప్రయత్నంలోనే తమ కుమార్తె లాత్విక ఉచిత సీటు సాధించడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.లాత్విక విశాఖపట్నం లోని శశి కళాశాలలో ఇంటర్ మీడియట్ అభ్యసించింది.

శభాష్..సమీర..!



పతివాడ సమీర

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ సమీర ఎంబీబీఎస్‌లో ఉచిత సీటును సాధించింది. ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షలో 2020వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్న సమీరకు గుంటూరులోని కాటూరి వైద్య కళాశాలలో ఉచిత సీటు లభించింది. సమీర తండ్రి పతివాడ త్రినాథ్ ఇదే మండలంలోని కుదిపి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఫ్రీ సీట్ సాధించిన సమీరను పలువురు అభినందించారు.

అర్హత లేని గ్రామీణ వైద్యులపై చర్యలు

- జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్

కురుపాం/జియ్యమ్మవలస రూరల్: గ్రామీణ వైద్యులు విచ్చలవిడిగా యాంటీబయాటిక్ మందులు ఇస్తూ రోగుల అనారోగ్యానికి కారణమవుతున్నారని.. అర్హత లేని ఆర్ఎంపీలపై చర్యలు తప్పవని జిల్లా ఔషధ నియంత్రణ అధికారి ఆషా షేక్ అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్‌లకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మందుల షాపుల్లో పెద్ద మొత్తంలో యాంటీ బయాటిక్స్, యాంటీ మలేరియా, స్టెరాయిడ్స్‌ను నిల్వ ఉంచరాదన్నారు. అంతేకాకుండా రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, తనిఖీ సమయంలో అధికారులకు చూపించాలని సూచించారు. పేషెంట్లను వీలైనంతవరకు ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలన్నారు. గ్రామాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలకు ఎట్టి పరిస్థితుల్లోను మందులు సరఫరా చేయొద్దని ఆదేశించారు. ప్రభుత్వ నిషేధిత మందులను పేషెంట్లకు డాక్టర్ చీటీ లేకుండా విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మెడికల్ షాపు యజమానులు తప్పనిసరిగా బిల్లు పుస్తకాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మందుల షాపుల యజమానులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాన్నా..లే నాన్న..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు



శ్రీనివాసరావు మృతదేహం



శ్రీనివాసరావు మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య మంగమ్మ, చిన్న కుమారుడు హర్ష

రామభద్రపురం: విద్యుదాఘాతంతో తండ్రి మృతి చెందగా.. అతని చేయి పట్టుకుని లే నాన్న.. లే అంటూ కుమారుడు రోదించిన తీరు చూసి అక్కడున్న వారంతా కంటతడి పెట్టారు. మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. మండలంలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ గోదాం వద్ద విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జన్నివలస గ్రామానికి చెందిన ముచ్చుపల్లి శ్రీనివాసరావు అల్ట్రాటెక్ సిమెంట్ గోదాంలో కలాసీగా పనిచేస్తున్నాడు. అయితే సాయంత్రం పని ముగిసిన తర్వాత గోదాం వద్ద జీ వైర్‌పై ఆరబెట్టిన దుస్తులు తీసుకుంటుండగా విద్యుత్ షాక్ కొట్టింది. జీ వైర్‌కు పక్కనున్న విద్యుత్ స్తంభం వస్తున్న సర్వీస్ తీగ తగలడంతో విద్యుత్ ప్రవాహం జరిగి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మంగ, కుమారులు రాము, హర్ష ఉన్నారు. రాము ఇంటర్మీడియట్, హర్ష పదో తరగతి చదువుతున్నారు. శ్రీనివాసరావు సంపాదన మీదే కుటుంబం ఆధారపడి ఉండడంతో.. ఇకపై ఎలా బతికేదంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే యజమాని నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాసరావు మృతి చెందాడని స్థానికులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.